క్లుప్తంగా

వేదగిరిలో హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన లక్ష్మీ నృసింహుడి ఆలయంలో హుండీ కానుకలను శుక్రవారం లెక్కించారు. 80 రోజులకు గానూ ప్రధాన హుండీల ద్వారా రూ.7,16,137, కొండి కాసుల హుండీ ద్వారా రూ.54,701, అన్నదాన హుండీ ద్వారా రూ.20,390 మొత్తాన్ని భక్తులు సమర్పించారని ఈఓ గోపీ తెలిపారు. బంగారం 248.500 గ్రాములు, వెండి 869 గ్రాములను సమర్పించారని వివరించారు.

కస్తూరిదేవి విద్యాలయాన్ని కాపాడరూ..

నెల్లూరు(బృందావనం): గొప్ప ఆశయంతో నగరంలో నెలకొల్పిన కస్తూరిదేవి బాలికల విద్యాలయాన్ని కాపాడాలని డాక్టర్ వసుంధర కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులకు బహిరంగ లేఖను శుక్రవారం రాశారు. పేద బాలికల కోసం పొణకా కనకమ్మ స్థాపించిన కస్తూరిదేవి విద్యాలయ ఆశయానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు.

రక్తదాన శిబిరం



నెల్లూరు(టౌన్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు మెడికల్ కళాశాల, హాస్పిటల్, ఎన్నెస్సెస్ యూనిట్, ఉయ్ ఆర్ విత్ యూ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయశర్మ, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ విభాగాధిపతి యశోవర్ధన్, ఎన్నెస్సెస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర రైతు విభాగ అధికార ప్రతినిధిగా నియమితులైన బట్టేపాటి నరేంద్రరెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. రామ్‌జీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జొన్నవాడ దేవస్థాన చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, నేతలు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, బిరదవోలు రూప్‌కుమార్, షబ్బీర్, దిలీప్, సుమంత్, కిశోర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల అధ్యక్షులకు శిక్షణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రిజిస్టరైన 32 రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాల అధ్యక్షులకు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని డీసీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓ గురప్ప మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించడం, పంటల సస్యరక్షణ తదితరాలపై శిక్షణ ఇచ్చామని వివరించారు. ప్రైమరీ సెక్టార్ జిల్లా కో ఆర్డినేటర్ అరుణ్‌కుమార్, ఆర్యా ఏజీ నేషనల్ రైతు ఉత్పత్తి సహకార సంఘాల ఉన్నతాధికారి నవనీత్, ఉరిమి ఏఐ గ్లోబల్ సర్వీసెస్ సీఈఓ గోపీరెడ్డి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు



నెల్లూరు రూరల్: నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఇఫ్తార్ విందును జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకర్ల సురేష్, కమిషనర్ సూర్యతేజ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఈడీ హైఫా, సూపరింటెండెంట్ రఘు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తీరేదెప్పటికో..?

- నగర వాసులకు నరకం
- అందుబాటులోకి రాని సిగ్నళ్లు



వీఆర్సీ సెంటర్‌లో అలంకారప్రాయంగా ట్రాఫిక్ సిగ్నల్

నెల్లూరు(క్రైమ్): అసలే అంతంతమాత్రంగా రహదారులు.. ఆపై చొచ్చుకొచ్చిన ఆక్రమణలు.. ఎక్కడపడితే అక్కడే నిలిపేస్తున్న వాహనాలు.. ముందుకు సాగని సిగ్నళ్ల ఏర్పాటు.. వెరసి నగర వాసులు ట్రాఫిక్ టెర్రర్‌తో నానా ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సిగ్నళ్లను పునరుద్ధరించడం ద్వారా సమస్య కొంతమేర పరిష్కారమవుతుందని పోలీసులు, నగరపాలక సంస్థ అధికారులు భావించారు. దీనికి సంబంధించి ఎస్పీటీ నెట్‌వర్క్ సంస్థతో గతేడాది నవంబర్‌లో ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఇవి నేటికీ అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

అంతా లోపభూయిష్టం

నగర జనాభా దాదాపు తొమ్మిది లక్షలకు చేరింది. వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగినా, రహదారులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. రోడ్లు విస్తరణకు నోచుకోకపోవడం, ఉన్నవి ఆక్రమణలతో కుచించుకుపోతుండటంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోంది. ఆత్మకూరు బస్టాండ్ నుంచి కేవీఆర్ పెట్రోల్ బంక్ వరకు వాహనాలు బారులుదీరి ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంటోంది. దీంతో నగరంలోకి రావాలన్నా.. కార్యాలయాలు, విద్యాసంస్థలకు వెళ్లాలన్నా అరగంట ముందే బయల్దేరాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది.

మరమ్మతులకు గురై.. మూలనపడి

కొన్నేళ్ల క్రితం రూ.కోట్లు వెచ్చించి ఆత్మకూరు బస్టాండ్, కనకమహల్ సెంటర్, గాంధీబొమ్మ, వీఆర్సీ, మద్రాస్ బస్టాండ్, ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేశారు. అయితే సిబ్బంది నిర్లక్ష్య ధోరణితో అవి మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. ఫలితంగా వాటి ఏర్పాటు ఉద్దేశం నీరుగారింది.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో ఎస్పీ కృష్ణకాంత్, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ చర్యలు చేపట్టారు. కనకమహల్ సెంటర్, వీఆర్సీ, ఏసీ కూరగాయల మార్కెట్, రామలింగాపురం, హరనాథపురం జంక్షన్లు, కేవీఆర్ పెట్రోల్ బంక్, జిల్లా పోలీస్ కార్యాలయ కూడళ్లల్లో రూ.1.39 కోట్లతో రెండు విడతల్లో ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన ఎస్పీటీ నెట్‌వర్క్‌తో ఒప్పందం చేసుకున్నారు. అయినా ఇది కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సిగ్నళ్లను త్వరితగతిన ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎస్పీ సౌజన్య ఆదేశించారు. రోడ్డు భద్రత హెచ్చరిక బోర్డులను నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను.. కార్లు, ఇతర వాహనదారులు సీట్ బెల్టును విధిగా ధరించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులను నమోదు చేస్తామని చెప్పారు. వాహనాలు నడుపుతూ మైనర్లు పట్టుబడితే వారి తల్లిదండ్రులపై సైతం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. వాట్సాప్ గవర్నెన్స్‌లో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రజలే వలంటీర్లుగా ట్రాఫిక్ అంబాసిడర్ గ్రూప్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఈ గ్రూప్ ద్వారా ప్రజలకు ట్రాఫిక్ పోలీసులు సేవలందిస్తున్నారని తెలిపారు. నెల్లూరు సౌత్, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరెడ్డి, రామకృష్ణ, ఆర్ఎస్సైలు చంద్రమౌళి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదాలకు సన్మానం





సత్కరిస్తున్న స్వర్ణ వెంకయ్య, నరేంద్రరెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన కార్యాలయంలో పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులైన స్వర్ణ వెంకయ్య శుక్రవారం సత్కరించారు. అనంతరం కృతజ్ఞతలను తెలియజేశారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నేతలు పాశం శ్రీనివాస్, యేసునాయుడు, హరిబాబుయాదవ్, వైవీ రెడ్డి, స్వర్ణ జీవన్‌ప్రసాద్, కొండేటి నరసింహరావు, అల్లాబక్షు, చెరుకూరు మధు, బెల్లంకొండ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన కార్యాలయంలో పార్టీ రైతు విభాగ అధికార ప్రతినిధిగా నియమితులైన బట్టేపాటి నరేంద్రరెడ్డి సత్కరించారు. కందుకూరు మాజీ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డికి సాయిబాబా ప్రతిమను అందజేశారు. నేతలు మావులూరు శ్రీనివాసులురెడ్డి, కొల్లపూడి శ్రీనివాసులురెడ్డి, దిలీప్‌రెడ్డి, షబ్బీర్, తాటి వెంకటరమణారెడ్డి, అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.
- ఆదాల ప్రభాకర్‌రెడ్డిని 29వ డివిజన్ కార్పొరేటర్ సత్తార్, డివిజన్ నేత జకీర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉగాది ఉత్సవ సమితి సమావేశం



మాట్లాడుతున్న సురేంద్రరెడ్డి

నెల్లూరు(బృందావనం): నగరంలోని శివాజీ సెంటర్‌లో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించాలని సింహపురి ఉగాది ఉత్సవ సమితి ప్రధాన సమన్వయకర్త సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. శివాజీ సెంటర్‌లోని ఓ హోటల్లో శుక్రవారం నిర్వహించిన సింహపురి ఉగాది ఉత్సవ సమితి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం, టీవీఎస్ కల్యాణసదన్ సంయుక్తంగా నిర్వహించనున్నాయని చెప్పారు. గో పూజ, గణపతిపూజ, షడ్రుచుల ఉగాది ప్రసాద వితరణ, కోలాట ప్రదర్శన తదితరాలను ఆదివారం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమాలకు తరలిరావాలని కోరారు. విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు, వేలూరు మహేష్, కార్తీక మాస లక్ష దీపోత్సవ సమితి నిర్వాహకులు కంజర్ల భాస్కర్‌శర్మ, ఆమంచర్ల ప్రభాకర్‌రావు, ఉగాది ఉత్సవ సమితి అధ్యక్షుడు రంగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కందుకూరు మాజీ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. వివిధ అంశాలపై చర్చించారు.

నేత్రదానం



అనిల్‌కుమార్ (ఫైల్)



హరి ఆచారి కుటుంబసభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న సునీల్

నెల్లూరు(అర్బన్): బీవీనగర్‌లోని గాయత్రినగర్‌లో నివాసం ఉంటున్న హరి ఆచారి (64) గురువారం మరణించారు. ఈ క్రమంలో ఆయన నేత్రాలను కుటుంబసభ్యురాలు కుమారి అంగీకారంతో సేకరించారు. అనంతరం సర్టిఫికెట్‌ను అందజేశారు.

- రాజరాజేశ్వరి దేవస్థాన సమీపంలోని పోలీస్ కాలనీలో నివాసం ఉంటున్న డేగా అనిల్‌కుమార్ (40) మరణించారు. ఈ క్రమంలో ఆయన నేత్రాలను పెద్దాస్పత్రికి కుటుంబసభ్యులు బాబు, కల్పన, డేగా నారాయణమ్మ దానం చేశారు. నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించి సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99595 89321 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా వైఎస్సార్టీయూసీ ఆవిర్భావ దినోత్సవం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని నగరంలోని మినీబైపాస్ రోడ్డులో జిల్లా అధ్యక్షుడు జయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. వైఎస్సార్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్‌ను కట్ చేశారు. పేదలకు అన్నదానాన్ని నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి, చల్లా రాము, స్ట్రీట్ వెండార్స్ విభాగ జిల్లా కార్యదర్శి సమద్, సునీల్ గవాస్కర్, యువరాజ్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఎం నేత మాలకొండారెడ్డి 40వ వర్ధంతిని పురస్కరించుకొని ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని శెట్టిగుంటరోడ్డులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. దాదాపు 150 మందికి నేత్ర పరీక్షలను వాసన్ ఐ కేర్ సహకారంతో నిర్వహించారు. వీరిలో 20 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. అనంతరం బోడిగాడితోట వద్ద గల మాలకొండారెడ్డి స్మారక స్తూపం వద్దకు ర్యాలీగా వెళ్లారు. పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, నరసింహ, శ్రీనివాసులురెడ్డి, చిరంజీవి, చెంగయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగు క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో విశ్వావసు నామ సంవత్సర తెలుగు క్యాలెండర్ల ఆవిష్కరణ, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, శంకర భగవత్పాదార్చనలను శుక్రవారం నిర్వహించారు. విశేష కార్యక్రమాలను గుండాపంతుల రామసుబ్రహ్మణ్యంశర్మ ఆధ్వర్యంలో జరిపారు. సామూహిక లలితాసహస్రనామ పారాయణాన్ని సాయంత్రం నిర్వహించారు. చక్రాలవారి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆనంద్‌కుమార్, మేనేజర్ చక్రాల వెంకటలక్ష్మీనరసింహం, సభ్యులు శ్రీహరి ప్రసాద్‌రావు, సత్యనారాయణ, రాధాలక్ష్మి, ఛాయాకుమారి, రత్నకుమారి, లక్ష్మీకామాక్షి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగాది వేడుకల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు

నెల్లూరు రూరల్: విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని డీఆర్వో ఉదయభాస్కర్‌రావు సూచించారు. ఉగాది వేడుకల నిర్వహణపై తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు వేడుకలను నిర్వహించనున్నామని వివరించారు. పంచాంగ శ్రవణం, వేద పఠనం, కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారని పేర్కొన్నారు. అధికారులందరూ తెలుగు సంప్రదాయ దుస్తులతో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి సదారావు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, హార్టికల్చర్ ఏడీ సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, దేవదాయశాఖ ఏసీ జనార్దన్‌రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓ కుమారి సేవలు అభినందనీయం



నెల్లూరు(అర్బన్): ప్రజలకు ఎనలేని సేవలందించిన రామతీర్థం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అరవ కుమారి సేవలు స్ఫూర్తిదాయకమని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి కొనియాడారు. దర్గామిట్టలోని ఎన్జీఓ హోమ్‌లో కుమారి ఉద్యోగ విరమణ సభను శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. మెడికల్, హెల్త్ రిటైర్డ్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్, గౌరవ సలహాదారు మున్వర్ సుల్తానా, జిల్లా కార్యదర్శి కల్లం శ్రీనివాసులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందిర, ఎన్జీఓ నేతలు వెంకటేశ్వర్లు, సతీష్‌బాబు, కరుణమ్మ, ఐఎన్టీయూసీ జిల్లా నేత కృష్ణయ్య, డాక్టర్లు నరేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



నెల్లూరు(బారకాసు): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలో గల రాజీవ్ గృహకల్ప వద్ద చేపట్టిన పారిశుధ్య పనులను ఎంహెచ్ఓ చైతన్య శుక్రవారం పరిశీలించారు. అనంతరం మద్రాస్ బస్టాండ్ సమీపంలోని కూరగాయల మార్కెట్ వద్ద పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. పుణె నుంచి డెమో నిమిత్తం తీసుకొచ్చిన స్వీపింగ్ / బ్రషింగ్ వెహికల్ పనితీరును ముత్తుకూరు రోడ్డు, అపోలో సెంటర్ నుంచి హైవే వరకు పరిశీలించారు.

లార్వా సర్వే పరిశీలన



నెల్లూరు(అర్బన్): నగరంలోని పీసీనాయుడి వీధిలో నిర్వహిస్తున్న లార్వా సర్వేను మలేరియా నివారణ సహాయాధికారి నాగార్జునరావు శుక్రవారం పరిశీలించారు. ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్త పడితే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా లాంటి వ్యాధులను అరికట్టొచ్చని చెప్పారు.

ఇఫ్తార్ విందు

నెల్లూరు(అర్బన్): బృందావనంలోని దుర్గా ఆస్పత్రిలో ఇఫ్తార్ విందును ఆబ్‌స్టెట్రిక్స్, గైనకాలజీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పల్లంరెడ్డి యశోధర, న్యూరాలజిస్ట్ పీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మైనార్టీ ఉద్యోగులతో పాటు చుట్టుపక్కల వారు హాజరయ్యారు.

వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ ఆందోళన

నెల్లూరు(అర్బన్): కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నాను కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం ఫెడరేషన్ నేత మహ్మద్ జియా ఉల్ హక్ మాట్లాడారు. బిల్లును వ్యతిరేకించాలని కోరారు.

పార్కుల్లో మౌలిక వసతులు కల్పించాలి



వ్యాయామ పరికరాలను పరిశీలిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కుల్లో వ్యాయామ పరికరాలు, పచ్చదనం, పెయింటింగ్ తదితర మౌలిక వసతులను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. 18వ డివిజన్లోని హరనాథపురం తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలో నగరపాలక సంస్థకు సంబంధించిన సుమారు ఒకటిన్నర ఎకరాల ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీని నిర్మించి పార్కు ఏర్పాటుకు కృషి చేస్తామని వెల్లడించారు. డివిజన్లోని 11 ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేశామని, తొలుత ఐదింట్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తామని చెప్పారు. మంత్రి నారాయణ ఆదేశాల మేరకు భూగర్భ డ్రైన్ అనుసంధాన ప్రక్రియను అన్ని గృహాలకు ఉచితంగా చేపట్టేలా చూస్తామని తెలిపారు. కార్పొరేటర్ అశోక్‌కుమార్, ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ రామ్మోహన్‌రావు, హార్టికల్చర్ ఏడీ ప్రదీప్‌కుమార్, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, డీఈఈ శేషగిరిరావు, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల మేరకే భవన నిర్మాణాలు

పట్టణ ప్రణాళిక విభాగ అనుమతుల మేరకే భవన నిర్మాణాలు జరిగేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతులను ఉల్లంఘించి నగరంలో నిర్మించిన అన్ని భవనాలకు చార్జిషీట్లను దాఖలు చేయాలని సూచించారు. ట్రాఫిక్‌కు అడ్డంకిగా రోడ్లు, వీధుల్లో ఉన్న నిరుపయోగమైన వాహనాలను పోలీసుల సాయంతో వెంటనే తొలగించాలని చెప్పారు. సిటీ ప్లానర్ పద్మజ, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు వేణు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుక అందజేత



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ముస్లింలకు రంజాన్ కానుకను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. సంతపేటలోని ఈద్గామిట్టలో మజ్జిగ జయకృష్ణారెడ్డి, ఖాదర్‌బాషా సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ హాజరయ్యారు. ఈ సందర్భంగా 500 మంది మహిళలకు చీరలు, నిత్యావసర సరుకులను అందజేశారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని భగత్‌సింగ్ కాలనీ, జనార్దన్‌రెడ్డికాలనీ, ఇస్లాంపేటలో గల మసీదుల్లో ఇమామ్‌లకు రంజాన్ కానుకను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. పేద ముస్లింలకు వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఇస్లాంపేటలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి, పార్టీ మైనార్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు సిద్ధిఖ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజా హుస్సేనీ, యువజన విభాగ అధ్యక్షుడు కిషన్, విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జయకృష్ణారెడ్డి, నేతలు మస్తాన్, అస్లామ్, సలామ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

- రంజాన్ కానుకను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 53వ డివిజన్ నేతలు అందజేశారు. నల్లకాలువ, విజయ డెయిరీ ఎదురుగా ఉన్న మసీదుల్లో ఇమామ్‌లకు వీటిని పార్టీ నేత వెంగళ్‌రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. నేతలు నాగరాజు, విజయ్, లక్ష్మీనారాయణ, బ్రహ్మారెడ్డి, బాలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



నెల్లూరు(అర్బన్): బుజబుజనెల్లూరులోని ఆస్థాన చిష్టియా వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులను రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. సాత్వికశ్రీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆమె తల్లిదండ్రులు సురేష్, మౌనిక వీటిని అందజేశారు. కార్యక్రమంలో పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, విశ్రాంత ఏఎస్సై మహబూబ్‌బాషా, రూడ్స్ చైర్మన్ రసూల్, కుడుముల సుబ్బారావు, సచివాలయ అడ్మిన్ అనిల్, చంద్రిక, నారాయణ, ఉపాధ్యాయుడు సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి సంగీత గానరవళి సభ రేపు



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): ఉగాదిని పురస్కరించుకొని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో భక్తి సంగీత గానరవళి సంగీత సభను ఆదివారం నిర్వహించనున్నామని ప్రేమసాధ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు నల్లమల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నర్తకి సెంటర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. సుబ్బారెడ్డి, విజయకృష్ణ, రఘురామిరెడ్డి, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 33 / 11 కేవీ శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస నగర్, జాకీర్‌హుస్సేన్‌నగర్, కిసాన్‌నగర్, సంతృ నారాయణపురం, నేతాజీనగర్, సింహపురి కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ఆరోగ్యంపై వాకర్స్‌కు అవగాహన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): యోగా, ఆయుర్వేదం తదితరాలపై నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వాకర్స్‌కు అవగాహన సదస్సును ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కిలారి శ్రీనివాసులునాయుడు, నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, గౌరవాధ్యక్షుడు తలపనేని హరిబాబు, డిస్ట్రిక్ట్ – 203 ఎలక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, గౌరవాధ్యక్షుడు వినుకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.